
RNI No :TELTEL2022/83073

# వేద న్యూస్
దినపత్రిక

వరంగల్ | గురువారం | పేజీలు : 4
సంపుటి : 3, సంచిక : 163 | మే 22, 2025 | వెల : రూ.3-00



పాకిస్తాన్‌లో సింధు జల పోరాటం
3లో..




## జీవవైవిధ్యాన్ని కాపాడుకోవాలి


- ప్రకృతి పరిరక్షణను సామాజిక బాధ్యతగా స్వీకరించాలి
- జీవ శాస్త్రవేత్త షేక్ హుస్సేన్
- ఓరుగల్లు వైల్డ్ లైఫ్ సొసైటీ ఆధ్వర్యంలో పాకాలలో ఘనంగా అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవం

**వేద న్యూస్, వరంగల్ జిల్లా ప్రతినిధి:**

వాతావరణంలో వస్తున్న మార్పులను అరికట్టడానికి జీవవైవిధ్యాన్ని కాపాడుకోవాలని జీవ శాస్త్రవేత్త, పర్యావరణ ప్రేమికుడు షేక్ హుస్సేన్ అన్నారు. అటవీ శాఖ, ఓరుగల్లు వైల్డ్ లైఫ్ సొసైటీ ఆధ్వర్యంలో సంయుక్తంగా గురువారం పాకాలలోని జీవవైవిధ్య పార్కులో అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకృతితో సామరస్యం మరియు అభివృద్ధి అనే అంశంపై నిర్వహించిన సదస్సుకు నర్సంపేట రేంజ్ అధికారి రవికిరణ్, నిర్మల్ రేంజ్ అధికారి వేణుగోపాల్, జన్నారం రేంజ్ అధికారిని సుష్మ, డిప్యూటీ రెంజ్ అధికారి రీనా, విధి స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు ధీరజ్, విజయ, ఓరుగల్లు వైల్డ్ లైఫ్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షులు ఇందారం నాగేశ్వర్ రావు, జాయింట్ సెక్రటరీ, ప్రముఖ పర్యావరణ వేత్త రవిబాబు పిట్టల, జర్నలిస్టులు కుడుతాడి బాపురావు, కొండల్ రెడ్డి, లింగబత్తిని కృష్ణ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఓరుగల్లు వైల్డ్ లైఫ్ సొసైటీ ఎన్జీవో వరంగల్

మిగతా 4వ పేజీలో..





# స్టేషన్లకు జనమే బాస్..

- దేశవ్యాప్తంగా 103 అమృత్ భారత్ స్టేషన్లు వర్చువల్‌గా ప్రారంభించిన ప్రధాని నరేంద్ర మోదీ
- స్టేషన్లను శుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత కూడా ప్రజలదే
- ఆపరేషన్ సిందూర్ న్యాయానికి కొత్త రూపం
- ఆపరేషన్ సిందూర్ పట్ల దేశ ప్రజలంతా గర్వపడుతున్నారు
- ప్రధాని నరేంద్ర మోదీ

**వేద న్యూస్, డెస్క్:**

ఆపరేషన్ సిందూర్ పట్ల దేశ ప్రజలంతా గర్వపడుతున్నారు. త్రివిధ దళాలు చక్రవ్యూహాలు పన్ని శత్రువులను ఉక్కిరిబిక్కిరి చేశాయి. మన మహిళల సిందూరం చెరిపేసిన వాళ్లను మట్టిలో కలిపేశాం. పహల్గాం ఘటనకు జవాబుగా 22 నిమిషాల్లోనే ఉగ్రవాదులను మట్టుబెట్టాం. మన సాయుధ దళాలు పాక్‌ను మోకాళ్ల మీద నిలబెట్టాయి. భారత్‌లో రక్తపుటేర్లు పారించినవాళ్లను ముక్కలు ముక్కలు చేశాం. ఆపరేషన్ సిందూర్ న్యాయానికి కొత్త రూపం. సమర్థ భారత రౌద్ర రూపం. ఉగ్రదాడి జరిగితే, మన సమాధానం ఇలాగే ఉంటుంది. ఉగ్రవాదులకు ఇకపై ఇలాంటి జవాబే దక్కుతుంది అని ప్రధాని నరేంద్ర మోదీ తెలిపారు. గురువారం దేశవ్యాప్తంగా 18 రాష్ట్రాల్లోని 86జిల్లాల్లో అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా ఆధునీకరించిన 103 రైల్వేస్టేషన్లను ప్రధాని నరేంద్ర మోదీ రాజస్థాన్‌లోని బీకానేర్‌లో జెండా ఊపి వర్చువల్‌గా ప్రారంభించి జాతికి అంకితమిచ్చారు. అనంతరం రాజస్థాన్‌లో రూ.26వేల కోట్లతో చేపట్టనున్న వేర్వేరు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. 103

మిగతా 4వ పేజీలో..


వేద న్యూస్
తెలుగు దినపత్రిక

కలెక్టర్ సంతకం ఫోర్జరీ!

- ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ టోకరా
- సుమారు30 మంది వద్ద నుంచి రూ.25 వేలు చొప్పున వసూలు
- ఏకంగా జిల్లా పాలనాధికారి పేరుతోనే మోసం
- వరంగల్ జిల్లా కలెక్టర్ ఫేక్ సిగ్నేచర్ తో నిరుద్యోగులకు వల
- లబోదిబోమంటున్న నిరుద్యోగులు
- జిల్లా కలెక్టర్ తగు చర్యలు తీసుకోవాలని వేడుకోలు

వేద న్యూస్, ఫోకస్ టీమ్:

ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మబలికి ఏకంగా వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సంతకంతో ఫేక్ అపాయింట్ మెంట్ కాపీ ఇచ్చాడు ఓ ఘనుడు. జనం అమాయకత్వాన్ని పెట్టుబడిగా మార్చుకొని అక్రమాలకు తెర తీస్తున్నారు. ఉద్యోగాలను ఎరగా వేస్తూ అందినకాడికి దోచేస్తున్నారు. సమాజంలో నిత్యం ఇలాంటి ఎన్నో రకాల మోసాలు వెలుగులోకి వస్తూనే ఉన్నాయి. తాజాగా ఇలాంటి ఓ మోసమే వరంగల్ జిల్లాలో వెలుగు చూసింది.

7 లక్షల 50 వేల రూపాయలు వసూలు..?

వరంగల్ కలెక్టరేట్ కార్యాలయంలో పెన్షన్ విభాగం కంప్యూటర్ ఆపరేటర్ గా కాంట్రాక్ట్ బేస్ ఉద్యోగాల పేరుతో ఘరానా మోసం జరిగింది. వరంగల్ జిల్లా వ్యాప్తంగా సుమారు 30 మంది వద్ద రూ.25 వేల చొప్పున వసూలు చేసి వరంగల్ జిల్లా కలెక్టర్ సంతకంతో అపాయింట్మెంట్ లెటర్స్ రెడీ చేసి ఇచ్చినట్టు తెలుస్తోంది. కాగా మే21 బుధవారం ఉద్యోగంలో చేరావచ్చని.. అపాయింట్మెంట్ లెటర్లతో పేర్కొన్నారు. కాగా, ఎవరైతే ఫేక్ అపాయింట్మెంట్ లెటర్ తీసుకున్నారో వారు కలెక్టరేట్‌కి

మిగతా 4వ పేజీలో..


## ‘ఫేక్’ వ్యక్తిపై చర్యలు తీసుకోండి

- సుబేదారి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసిన వరంగల్ కలెక్టరేట్ అధికారులు
- ‘వేద న్యూస్’ కథనానికి స్పందన

**వేద న్యూస్, వరంగల్ టౌన్:**

ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మబలికి ఏకంగా వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సంతకంతో ఫేక్ అపాయింట్ మెంట్ కాపీ ఇచ్చాడు ఓ ఘనుడు. ఈ ఘటనపై ‘వేద న్యూస్’ తెలుగు దినపత్రిక గురువారం కలెక్టర్ సంతకం ఫోర్జరీ శీర్షికతో కథనం ప్రచురించింది. స్పందించిన వరంగల్ కలెక్టరేట్ అధికారులు కలెక్టర్ సత్య శారద ఆదేశాల మేరకు సుబేదారి పోలీస్ స్టేషన్లో ఏఓ (అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్) లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు అందుకున్న సుబేదారి పోలీసులు కలెక్టర్ ఫేక్ సిగ్నేచర్ తో అమాయక నిరుద్యోగులను వలలో వేసుకున్న ఘనుడు ఎవరని విచారణ చేపట్టారు. కాగా తమను నమ్మించి మోసం చేసిన వ్యక్తిని పట్టుకొని చట్టపరిధిలో కఠినంగా శిక్షించి తమకు న్యాయం చేయాలని నిరుద్యోగులు వేడుకుంటున్నారు.



## ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంచాలి

**వరంగల్-ఖమ్మం-నల్గొండ టీచర్స్ ఎమ్మెల్సీ పింగిళి శ్రీపాల్ రెడ్డి**

**వేద న్యూస్, నల్లబెల్లి**

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదును పెంచాలని ఎమ్మెల్సీ పింగిళి శ్రీపాల్ రెడ్డి అన్నారు. నల్లబెల్లి జెడ్పీహెచ్ ఎస్‌లో గత మూడు రోజులుగా జరుగుతున్న ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుల శిక్షణకు గురువారం ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి హాజరై ప్రసంగించారు. ప్రభుత్వం తీసుకువచ్చిన ఎఫ్ఎల్ఎన్ ప్రోగ్రామ్‌లో నూతన సాంకేతికను ఉపయోగించుకుని విద్యార్థుల ప్రగతి అభ్యున్నతికి కృషి చేయాలని అన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా బోధన విధానంలో మార్పులను తీసుకుని బోధన జరపాలని కోరారు. విద్యార్థుల నమోదు విషయంలో ప్రత్యేక దృష్టి పెట్టి ప్రైవేటుకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా బోధన చేయాలని అన్నారు. న్యాస్, ఎఫ్ఎల్ఎన్ సర్వేల్లో 80 శాతం ప్రగతి సాధించేందుకు ప్రతి ఒక్క ఉపాధ్యాయుడు కృషి చేయాలని పిలుపునిచ్చారు. అదే విధంగా ఉద్యోగు లకు రావాల్సిన ఐదు డీఏల్లో కనీసం రెండు డీఏలు ఇప్పించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. రాబోయే కాలంలో ఎస్జీటీ ఉపాధ్యాయులకు టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కల్పించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఉపాధ్యాయుల సమస్యల సాధనకు ప్రభుత్వంతో చర్చించి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అనంతరం నల్లబెల్లి ఎంఈవో ఎం.అ నురాధ, ఎమ్మార్పీలతో కలిసి శాలువ కప్పి ఘనంగా సన్మానించారు. ఎంఆర్పీలు సతీష్ కుమార్, బద్రీనాథం, లింగమూర్తి, బిక్షపతి, వేణుగోపాలా చారి, రాజిరెడ్డి, శ్రీనివాస్, నాగరాజులతో పాటు వివిధ ఉపాధ్యాయ సంఘాల నేతలు, ఉపాధ్యాయులు, సీఆర్పీలు, ఎమ్మార్పీ సిబ్బంది పాల్గొన్నారు.



## దయనీయంగా జర్నలిస్టుల పరిస్థితులు

**టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య**

**వేద న్యూస్, జగిత్యాల :**

రాష్ట్రంలోని జర్నలిస్టులకు తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) సంఘం ఎల్లప్పుడు అండగా ఉంటుందని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య అన్నారు. పాత్రికేయుల సమస్యల పై సమిష్టి పోరాటానికి సన్నద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. జర్నలిస్టులు ఎవరికీ భయపడకుండా ధైర్యంగా ముందుకు వచ్చి సంఘంలో సభ్యత్వం పొందడం ద్వారా సంఘాన్ని బలోపేతం చేయాలని ఆయన కోరారు. గురువారం జగిత్యాలలో జరిగిన టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా ముఖ్య నేతల సన్నాహక సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మామిడి సోమయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో

జర్నలిస్టుల పరిస్థితులు దయనీయంగా మారుతున్నాయని, ముఖ్యంగా గ్రామీణ విలేకరుల పరిస్థితి అధ్వాన్నంగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం పదేళ్లు జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించకుండా ద్రోహం చేసిందని, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం కూడా జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించకుండా కాలయాపన చేస్తుందని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర కావస్తున్నా ఇంత వరకు జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించలేదని అన్నారు. జర్నలిస్టులంతా ఏకమై రాబోయే రోజుల్లో సమస్యలపై బలమైన పోరాటం చేయడానికి సిద్ధం కావాలని మామిడి సోమయ్య పిలుపునిచ్చారు. రాష్ట్రంలో రెండు జర్నలిస్టు సంఘాలు పాలకుల పక్షాన నిలిచి జర్నలిస్టుల సమస్యలను విస్మరించాయని ఆయన విమర్శించారు. అలాంటి సంఘాల పట్ల జర్నలిస్టులు అప్రమత్తంగా ఉండాలన్నారు. చిన్న, పెద్ద పత్రికల జర్నలిస్టులు, యువ జర్నలిస్టులు, ఇతర సంఘాల నుంచి పెద్దఎత్తున టీడబ్ల్యూజేఎఫ్ లో చేరుతున్నారని చెప్పారు. రాబోయే రెండు మాసాల్లో అన్ని జిల్లా మహాసభలు పూర్తి చేసి పెద్ద ఎత్తున రాష్ట్ర మహాసభ జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వల్లాల జగన్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ద్యావర సంజీవ రాజు,

మిగతా 4వ పేజీలో..



# భక్తిశ్రద్ధలతో హనుమాన్ జయంతి

## పాల్గొన్న దంపతులు దేప భాస్కర్ రెడ్డి సురేఖ రెడ్డి

**వేద న్యూస్, రంగారెడ్డి ప్రతినిధి:**



మహేశ్వరం నియోజకవర్గం రామకృష్ణాపురం డివిజన్ లోని శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో హనుమన్ జయంతి సందర్భంగా గురువారం నాడు తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ సభ్యులు దేపాభాస్కర్ రెడ్డి సురేఖ దంపతులు పాల్గొని మాల ధారణ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి, రామకృష్ణాపురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ కాంటెస్టెడ్ కార్పొరేటర్ పున్నా నిర్మల గణేష్,గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ డైరెక్టర్ బండి మధుసూదన్ రావు, ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయ చైర్మన్ తలాటి రమేష్, ఖిల్లా మైసమ్మ దేవాలయం చైర్మన్ సురేష్, పాలకవర్గ సభ్యులు బొడ్డుపల్లి మహేందర్, సుజాత రెడ్డి, శ్రీమన్నారాయణ, జ్ఞానేశ్వర్ యాదవ్, శేఖర్ ముదిరాజ్, పెద్దవూర సైదులు, శ్రావణ్ కురమ, శ్రీధర్, శ్రీనాథ్,విప్లవ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# చిరు వ్యాపారుల రాస్తారోకో

**వేద న్యూస్,మిర్యాలగూడ ప్రతినిధి :**



నల్గొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలో చిరు వ్యాపారులు ఆందోళన చేసిన ఘటన చోటుచేసుకుంది. చిరు వ్యాపారులు మిర్యాలగూడ పట్టణంలోని మెయిన్ రోడ్డు మీద ధర్నా చేస్తూ తమకు న్యాయం చేయాలని పోలీసులకు విన్నవించడం జరిగింది. ఈ సందర్భంగా చిరువ్యాపారులు మాట్లాడుతూ పోలీసులు తమ యొక్క పండ్లబండ్లను తీసివేయడం జరుగుతుందని,ఎన్నో సంవత్సరాల నుండి ఇక్కడే వ్యాపారం చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు తమ బండ్లను తీసివేయకుండా ఉంచాలని స్థానిక ఎమ్మెల్యే స్పందించి,చొరవ తీసుకొని న్యాయం చేయాలని రోడ్డుపై ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ ధర్నా కార్యక్రమంతో మిర్యాలగూడ పట్టణ పరిధిలో కొద్దిసేపు భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. అనంతరం మిర్యాలగూడ పోలీసులు వారికి సర్ది చెప్పి రోడ్డుపై ట్రాఫిక్ ను క్లియర్ చేయడం జరిగింది.

# కొత్తపల్లి సైదులుకు బ్లడ్ డోనర్,మోటివేటర్ అవార్డు ప్రధానం

**వేద న్యూస్,మిర్యాలగూడ ప్రతినిధి:**



మాతృదేవోభవ పితృదేవోభవ స్వచ్ఛంద సంస్థ చేత సామాజిక కార్యకర్త,రక్త ధాత కొత్తపల్లి సైదులుకు బ్లడ్ డోనర్,బ్లడ్ మోటివేటర్- 2025 అవార్డు తోపాటు ఘన సన్మానం చేయడం జరిగింది. భువనగిరి యాదాద్రి జిల్లా మోత్కూరు మండలం పాటిమట్ల గ్రామంలో మాతృదేవోభవ పితృదేవో భవ సంస్థ వ్యవస్థాపకులు కురుమేటి నవీన్ ఆధ్వర్యంలో రక్తదాతలకు ఘన సన్మానం చేశారు. ఆ సంస్థ ఆరో వార్షికోత్సవం సందర్భంగా రక్త దాతలకు పురస్కారాన్ని అందజేయడం కొరకు సి.బి.ఐ మాజీ డైరెక్టర్ జేడీ లక్ష్మీనారాయణ,జనయేత్రీ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్.మునిర్ అహ్మద్ షరీఫ్ లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారి చేతుల మీదుగా అవార్డు ప్రధానోత్సవం జరిగింది. ఈ సందర్భంగా బ్లడ్ డోనర్ మోటివేటర్ 2025 అవార్డు గ్రహీత కొత్తపల్లి సైదులు మాట్లాడుతూ తనకి అవార్డు ఇచ్చిన మాతృదేవోభవ పితృదేవోభవ సంస్థ ఫౌండర్ నవీన్ కు మరియు అవార్డు ప్రధానం చేసిన సిబిఐ మాజీ డైరెక్టర్ అవినీతిపరుల గుండెల్లో సింహస్వప్నం జేడీ లక్ష్మీనారాయణ,జనయేత్రి ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ మునీర్ అహ్మద్ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ప్రతి ఇంటికి ఒక రక్తదాత తయారు కావాలని,ప్రతి ఒక్క యువకుడి లో రక్తదానం పట్ల అవగాహన కలిగి ఉండాలని అప్పుడే రక్తం కొరత లేని సమాజం నిర్మాణం అవుతుందని సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు రక్తదాతలకు మెమొంటోలు ఇచ్చి,శాలువతో సన్మానం చేసి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భువనగిరి యాదాద్రి జిల్లా రెడ్ క్రాస్ చైర్మన్ నరసింహారెడ్డి,సర్దార్ సర్వాయి పాపన్న గీతా కార్మిక యువజన సంఘం ఆల్ ఇండియా అధ్యక్షులు కప్పల రవికుమార్ గౌడ్ లతోపాటు మాతృదేవోభవ, పితృదేవో భవ స్వచ్ఛంద సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

# బీజేపీ నేత కూతురికి అభినందనలు తెలిపిన భాగ్యలక్ష్మి రెడ్డి

**వేద న్యూస్, రంగారెడ్డి ప్రతినిధి :**





భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు మాజీ సింగిల్ విండో చైర్మన్ కొలను శంకర్ రెడ్డి కుమార్తె అదిలాపురం అలియాస్ కొలను బాంధవీ రెడ్డి కెఎంఐటిలో బీటెక్ పూర్తి చేసి ఉన్నత విద్య కోసం అమెరికా దేశం వెళ్లి న్యూ జెర్సీ రాష్ట్రంలోని మాస్టర్ పూర్తి చేసి పట్టా పొందిన సందర్భంగా భాగ్యలక్ష్మి రెడ్డి ( బాలాపూర్ వినాయక లడ్డు గ్రహీత ) అభినందనలు అందజేశారు. ఈ సందర్భంగా సీనియర్ బిజెపి నాయకులు కొలను శంకర్ రెడ్డి మాట్లాడుతూ తమ కుమార్తె ఎంఎస్ పట్టా పొందిన సందర్భంగా సాధారణ వ్యవసాయ కుటుంబంలో జన్మించి అంచలంచలుగా ఉన్నత శిఖరాలను అధిరోహించుటకు బంధువులు దేవుడి ఆశీస్సులతో ముందుకు సాగాలని కోరుకుంటూ భగవంతుడు ఆశీస్సులు ఎప్పుడూ ఉండాలని కోరారు.

# దివ్యాంగులకు తీపి కబురు

- గృహ కేటాయింపుల్లో దివ్యాంగులకు 4 శాతం రిజర్వేషన్
- కేంద్ర మంత్రి మనోహర్ లాల్ చారిత్రాత్మక నిర్ణయం

**వేద న్యూస్, డెస్క్:**



దివ్యాంగులకు కేంద్ర ప్రభుత్వం ఒక ముఖ్యమైన శుభవార్తను అందించింది. కేంద్ర ప్రభుత్వ గృహాల కేటాయింపులో దివ్యాంగులకు 4 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ కేంద్ర మంత్రి మనోహర్ లాల్ గురువారం ఒక కీలక నిర్ణయం తీసుకున్నారు. పౌరులందరికీ సమాన అవకాశాలు కల్పించాలనే ప్రభుత్వ నిబద్ధతను 'సుగమ్య భారత్ అభియాన్' కింద మరోసారి చాటిచెప్పడమే ఈ నిర్ణయం వెనుక ఉన్న ముఖ్య ఉద్దేశమని కేంద్ర గృహనిర్మాణ మరియు పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో వెల్లడించింది. దివ్యాంగుల హక్కుల చట్టం, 2016 స్ఫూర్తికి అనుగుణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు మంత్రిత్వ శాఖ తెలిపింది. కేంద్ర ప్రభుత్వ నివాస గృహాలను దివ్యాంగులకు సముచితంగా అందుబాటులోకి తెచ్చేందుకు డైరెక్టరేట్ ఆఫ్ ఎస్టేట్స్ ఒక అధికారిక మెమోరాండం జారీ చేసిందని పేర్కొంది. "ప్రతి పౌరుడి సాధికారత పట్ల ప్రభుత్వానికి ఉన్న అంకితభావానికి ఈ చొరవ నిదర్శనం. సమ్మిళిత మరియు అందరికీ అందుబాటులో ఉండే భారతదేశ నిర్మాణానికి ఇది మరింత బలాన్ని చేకూరుస్తుంది" అని ఆ ప్రకటనలో వివరించారు.

# అమెరికా వాసులే టార్గెట్!

**అచ్యుతాపురంలో భారీ సైబర్ మోసం వెలుగులోకి! - కాల్ సెంటర్ ద్వారా అమెరికన్లే లక్ష్యంగా దందా**


**వేద న్యూస్, డెస్క్:**



అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం కేంద్రంగా సాగుతున్న భారీ అంతర్జాతీయ సైబర్ మోసం గుట్టురట్టయింది. అమెరికా పౌరులనే లక్ష్యంగా చేసుకొని, కాల్ సెంటర్ ముసుగులో కోట్లాది రూపాయలు కొల్లగొడుతున్న ముఠా కార్యకలాపాలను పోలీసులు ఛేదించారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా మీడియాకు వెల్లడించారు. ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన కొందరు వ్యక్తులు గత రెండేళ్లుగా అచ్యుతాపురంలో ఓ కాల్ సెంటర్‌ను నిర్వహిస్తున్నారని ఎస్పీ తెలిపారు. ఈ కాల్ సెంటర్ ద్వారా అమెరికాతో పాటు ఇతర దేశాల ప్రజలను లక్ష్యంగా చేసుకుని సైబర్ మోసాలకు పాల్పడుతున్నట్లు తమ దర్యాప్తులో తేలిందని ఆయన వివరించారు. ఈ ముఠా నెలకు సుమారు రూ. 15 కోట్ల నుంచి రూ. 20 కోట్ల వరకు మోసాలకు పాల్పడుతున్నట్లు ప్రాథమికంగా గుర్తించామని ఎస్పీ పేర్కొన్నారు. అచ్యుతాపురంలోని ఈ నకిలీ కాల్ సెంటర్‌లో దాదాపు 200 నుంచి 250 మంది వరకు పనిచేస్తున్నారని, వీరిలో ఇప్పటివరకు 33 మందిని అరెస్టు చేశామని ఎస్పీ తుహిన్ సిన్హా తెలిపారు. నిందితుల నుంచి రూ. 3 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఆయన చెప్పారు. కాల్ సెంటర్‌కు సంబంధించి దేశవ్యాప్తంగా ఉన్న నిందితులను పట్టుకోవడానికి ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేసినట్లు ఎస్పీ వెల్లడించారు. ఈ వ్యవహారంలో ప్రమేయం ఉన్న వారిపై చర్యలు తీసుకునేందుకు కేంద్ర ప్రభుత్వ సంస్థలు, సీఐడీ అధికారుల సహకారం కూడా తీసుకుంటున్నామని, నిందితులందరినీ త్వరలోనే పట్టుకుంటామని ఆయన స్పష్టం చేశారు. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది.

# దేశంలో మళ్లీ కరోనా అలజడి

**వేద న్యూస్, న్యూఢిల్లీ :**



దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో కరోనా వైరస్ కేసులు మళ్లీ పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. మహారాష్ట్ర, తమిళనాడు, కర్ణాటక, గుజరాత్ వంటి రాష్ట్రాల్లో కోవిడ్-19 బాధితుల సంఖ్య క్రమంగా అధికమవుతుండటంతో ఆరోగ్య శాఖ అధికారులు నిఘా పెంచి, ముందుజాగ్రత్త చర్యలు ముమ్మరం చేశారు. అయితే, ప్రస్తుతానికి నమోదవుతున్న కేసులన్నీ స్వల్ప లక్షణాలతోనే ఉన్నాయని, ఎటువంటి మరణాలు సంభవించలేదని అధికారులు స్పష్టం చేస్తున్నారు. అయినప్పటికీ, ముంబై, చెన్నై, అహ్మదాబాద్ వంటి ప్రధాన నగరాల్లో కేసుల పెరుగుదల స్పష్టంగా కనిపిస్తోంది. మహారాష్ట్ర ఆరోగ్య శాఖ వెల్లడించిన వివరాల ప్రకారం, ఒక్క ముంబై నగరంలోనే మే నెలలో 95 కొత్త కోవిడ్ కేసులు నమోదయ్యాయి. జనవరి నుంచి రాష్ట్రవ్యాప్తంగా నమోదైన 106 కేసుల్లో ఇవి అత్యధికం కావడం గమనార్హం. ప్రస్తుతం 16 మంది ఆసుపత్రుల్లో చికిత్స పొందుతుండగా, వీరిలో చాలామందిని వైరస్ వ్యాప్తిని అరికట్టేందుకు కేఈఎం ఆసుపత్రి నుంచి సెవెన్ హిల్స్ ఆసుపత్రికి తరలించారు. ఇన్ ఫ్లుయెంజా లేదా తీవ్రమైన శ్వాసకోశ ఇన్ఫెక్షన్ లక్షణాలున్న వారందరికీ కోవిడ్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

# పాకిస్థాన్‌కు మద్దతు: టర్కీకి భారత్ స్ట్రాంగ్ మెసేజ్!

**వేద న్యూస్, న్యూఢిల్లీ :**



సరిహద్దు ఉగ్రవాదం విషయంలో పాకిస్థాన్‌కు మద్దతుగా నిలుస్తున్న టర్కీ వైఖరిపై భారత ప్రభుత్వం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. పాకిస్థాన్ నుంచి ఉద్భవిస్తున్న ఉగ్రవాద సమస్యను పరిష్కరించేలా ఆ దేశానికి సూచించాలని టర్కీ ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు గురువారం స్పష్టం చేసింది. ఉగ్రవాదాన్ని ఒక ప్రభుత్వ విధానంగా ఉపయోగించకుండా పాకిస్థాన్‌ను నిరోధించాలని, దశాబ్దాలుగా ఇస్లామాబాద్, రావల్పిండి పెంచి పోషిస్తున్న ఉగ్రవాద వ్యవస్థలపై విశ్వసనీయమైన, ధృవీకరించదగిన చర్యలు తీసుకునేలా చూడాలని టర్కీకి భారత్ సూచించింది. పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడి అనంతరం, టర్కీ పాకిస్థాన్ వైపు మొగ్గు చూపడంతో ఇరు దేశాల సంబంధాలు దెబ్బతిన్నాయని భారత విదేశాంగ శాఖ పేర్కొంది. దేశాల మధ్య సంబంధాలు పరస్పర గౌరవం, ఒకరి ఆందోళనలను మరొకరు అర్థం చేసుకునే సున్నితత్వంపై ఆధారపడి ఉంటాయని భారత్ స్పష్టం చేసింది. ఈ మేరకు విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ వారానికోసారి జరిగే మీడియా సమావేశంలో తెలిపారు. పహల్గామ్ ఉగ్రదాడితో ప్రారంభమైన భారత్‌కు వ్యతిరేకంగా పాకిస్థాన్ దుశ్చర్యలకు పాల్పడటంలో టర్కీ పాత్ర, భారత్ చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' ప్రతిస్పందన సమయంలో వెలుగులోకి వచ్చింది. ఇస్లామాబాద్‌కు సైద్ధాంతిక, నైతిక మద్దతుతో పాటు, టర్కీ పాకిస్థాన్‌కు ఆయుధాలను కూడా సరఫరా చేసిందనే ఆరోపణలు వచ్చాయి.

# సంపాదకీయం

## ప్రైవేట్ చదువులు భారమేనా!

ప్రైవేటు బడి ఫీజు భారమైంది. అక్షరాలు దిద్దించడానికే లక్షలు దాటింది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా స్కూల్ ఫీజులు గణనీయంగా పెరిగాయి. 5% దాటని ధనవంతుల సంగతి పక్కనపెడితే మిగతా 95% మధ్యతరగతి, దిగువ మధ్య తరగతి కుటుంబాలు ఈ ఆర్థిక భారం మోయలేక పిల్లలకు మంచి చదువులు చెప్పించలేక మనోవేదనకు గురవుతున్నారు. బెంగళూరు నుంచి ఢిల్లీ వరకు సర్వత్రా ఇదే పరిస్థితి. ముఖ్యంగా గత మూడేళ్లలో స్కూల్ ఫీజులు అనేక రెట్లు పెరిగాయని స్కూల్ పిల్లల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దేశవ్యాప్తంగా పాఠశాల ఫీజులు మూడు ఏళ్లలోనే 50 నుంచి 80 శాతం పెరిగాయని తాజా జాతీయ సర్వే సైతం నిర్ధారించింది. స్కూల్ ఫీజులపై ఎటువంటి నియంత్రణ లేకపోవడంతో ప్రైవేట్ స్కూల్ యాజమాన్యాలు ఇష్టారీతిగా ఏటా ఫీజులు పెంచుకుంటూ వెళ్తున్నారు. దీంతో పిల్లలను చదివించడానికి తల్లిదండ్రులకు తడిసి మోపెడవుతున్నది. కమ్యూనిటీ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ అయిన లోకల్ సర్కిల్స్ నిర్వహించిన సర్వేలో 44 శాతం మంది తల్లిదండ్రులు తమ పిల్లలు చదువుతున్న పాఠశాలలో గత మూడేళ్లలో ఫీజులు 50 నుంచి 80 శాతం పెరిగాయని చెప్పినట్లు సర్వే నివేదిక వెల్లడించింది. దేశవ్యాప్తంగా ఉన్న 309 జిల్లాల్లోని 31 వేల మంది స్కూల్ విద్యార్థుల తల్లిదండ్రులపై ఈ సర్వే నిర్వహించారు. ఈ సర్వేలో పాల్గొన్న దాదాపు 93 శాతం మంది తల్లిదండ్రులు పాఠశాలల అధిక ఫీజుల నియంత్రణపై ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు తగు చర్యలు తీసుకోవడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. తల్లిదండ్రుల ఆశలను అవకాశంగా మలుచుకున్న ప్రైవేటు స్కూళ్ల యాజమాన్యాలు వివిధ పేర్లతో బురిడీ కొట్టిస్తున్నాయి. దీంతో అత్యాశకుపోయి లక్షలు కుమ్మరిస్తూ భారం భరిస్తున్నారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా స్కూల్ ఫీజులు గణనీయంగా పెరిగాయి. ఒకప్పుడు గ్రామర్, కాన్సెప్ట్ స్కూళ్లు అంటేనే అదేదో బ్రహ్మ పదార్థంలా చూసేవారు.

ఇప్పుడు కాన్సెప్ట్ పోయి టాలెంట్, టెక్నో, ఇ- టెక్నో, డిజి, మోడల్ స్కూల్, ఐఐటి, జెఇఇ, సివిల్స్ ఫౌండేషన్ అంటూ తల్లిదండ్రులను ఊహా లోకంలోకి తీసుకెళ్లేందుకు పాఠశాల యాజమాన్యాలు ప్రయత్నిస్తున్నాయి. ఎలాంటి అనుమతి లేకుండా ఏటా 20 నుంచి 30% ఫీజులను యాజమాన్యాలు యథేచ్ఛగా పెంచుతూ వెళ్తున్నాయి. జీవో నెంబర్ 91 ప్రకారం దరఖాస్తు రుసుం రూ. 100, అడ్మిషన్ ఫీజు రూ. 500 మాత్రమే తీసుకోవాలి. పాఠశాలలో పుస్తకాలు, విద్యా సామగ్రిని కొనుగోలు చేయాలన్న నిబంధనలు పెట్టరాదు. సెక్షన్ -8(1) ప్రకారం విద్యా సంస్థ పేర్లకు ఇంటర్నేషనల్, ఐఐటి, ఒలంపియాడ్, కాన్సెప్ట్, ఇ -టెక్నో వంటి పదాలను చేర్చకూడదు. జిఒ 88 ప్రకారం 200 మంది విద్యార్థులు చదివే పాఠశాలలో 700 చదరపు మీటర్ల విస్తీర్ణంలో క్రీడా మైదానం ఉండాలి. అగ్నిప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి. అగ్నిమాపక సామగ్రిని అందుబాటులో ఉంచాలి. కానీ ఏ ఒక్క కార్పొరేట్ విద్యా సంస్థల్లో అగ్నిమాపక సామగ్రిని పెట్టడం లేదు. కనీసం నోటీసు బోర్డుపై ఏ తరగతికి ఎంత ఫీజు వసూలు చేస్తామో కూడా చెప్పకుండా, పరిమితి లేకుండా ఫీజులను వాళ్లే నిర్ణయించేస్తున్నారు. చాలా పాఠశాలల్లో ఎత్తయిన గోడలు, ఎసి తరగతి గదులు, ప్రత్యేకమైన టేబుళ్లు, కుర్చీలు, ఎసి బస్సులు, డిజిటల్ బోర్డులు, డిజిటల్ మెటీరియల్ చూపి, భారీగా ఫీజులు వసూలు చేస్తున్నారు. సాధారణంగా, టైర్ 1, టైర్ 2 నగరాల్లో ప్రైవేట్ స్కూళ్ల ట్యూషన్ ఫీజులు ప్రతి నెలా రూ. 2,500 నుండి రూ. 8,000 వరకు ఉంటాయి. కొన్ని స్కూళ్లు వార్షిక ఫీజులు కూడా విధిస్తాయి. ఇవి ఒక్కో స్కూల్‌కి ఒక్కో విధంగా ఉంటాయి. ఉదాహరణకు ముస్సోరీలోని వుడ్‌స్టాక్ స్కూల్ భారతదేశంలో అత్యంత ఖరీదైన పాఠశాలలలో ఒకటి. వార్షిక ఫీజులు రూ. 18 లక్షలకు చేరుకుంటున్నాయి. ప్రైవేట్ స్కూల్ ఫీజులు తల్లిదండ్రులకు ఒక ప్రధాన అంశం. ఫీజులు చాలా ఎక్కువగా ఉండటం వల్ల తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేట్ స్కూళ్లలో చేర్చడానికి వెనకడుగు వేస్తున్నారు.

కొన్ని రాష్ట్రాలు, నగరాలు ఫీజులను నియంత్రించడానికి చట్టాలు, నిబంధనలు తీసుకువచ్చాయి. కానీ మన రాష్ట్రంలో విద్యా కమిషన్ వున్నా స్కూల్ ఫీజులలో ఎటువంటి మార్పు లేదు. విద్యార్థుల నుండి తీసుకున్నటువంటి ఫీజులో పాఠశాల నిర్వహణ, విద్యుత్, అద్దె ఖర్చులు, 15 శాతం స్కూల్ అభివృద్ధికి ఉపయోగించాలి. 15 శాతం ఫీజును స్కూల్ సిబ్బందికి బీమా, భవిష్య నిధి కోసం కేటాయించాల్సి ఉంటుంది. 2008 జిఒ నెం. 90, 91, 92 ప్రకారం ఫీజు నిర్ణయించేందుకు జిల్లా విద్యాశాఖ అధికారి, ఓ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి, విద్యార్థి సంఘాలు, ప్రైవేటు విద్యా సంస్థల ప్రతినిధితో కమిటీని ఏర్పాటు చేయాలి. దీనికి కలెక్టర్ చైర్మన్‌గా ఉండాలి. ఈ కమిటీ పాఠశాలను పరిశీలించి మౌలిక సదుపాయాలు, పరిస్థితి చూసి ఎంత ఫీజులు వసూలు చేయాలనే విషయమై నివేదిక ఇస్తుంది. దీనిపై విద్యా సంవత్సరం ఆరంభానికి ముందే ప్రభుత్వపరంగా ఓ ప్రకటన విడుదల చేయాలి. జిఒ నెంబర్ 42 ప్రకారం ఫీజులను పెంచాలంటే జిల్లా ఫీజ్ రెగ్యులేషన్ కమిటీ అనుమతి తీసుకోవాలి. రోజురోజు ఫీజులు పెంచుతున్నారు తప్ప తగ్గించడం లేదు. ఫీజుల నియంత్రణ, టీచర్ల నియామకం, డొనేషన్ల వసూలు వంటి అంశాల్లో విద్యా హక్కు చట్టం చాలా స్పష్టమైన మార్గదర్శకాలు ఇచ్చినా వాటిని పాటించడం చాలా ప్రైవేట్ పాఠశాలల్లో కనిపించడం లేదు. చట్టాన్ని ఉల్లంఘిస్తే భారీగా జరిమానాలు విధించేలా చర్యలు తీసుకోవాలని విద్యా నిపుణులు డిమాండ్ చేస్తున్నారు. ప్రవేశ పరీక్షల పేరుతో డొనేషన్లు వసూలు చేస్తే రూ. 25,000 నుండి రూ. 50,000 వరకు జరిమానా విధించేలా చట్టంలో నిబంధనలు ఉన్నాయి. అంతేకాకుండా ప్రతి ప్రైవేట్ పాఠశాలలో కనీసం 25 శాతం సీట్లు వెనుకబడిన వర్గాల విద్యార్థులకు ఉచితంగా ఇవ్వాలన్న నిబంధన విద్యా హక్కు చట్టంలో ఉంది. కానీ దీనిపై కూడా పర్యవేక్షణ లేదు. ఫీజుల నియంత్రణకు ప్రత్యేక చట్టం తీసుకురావాలి. విద్యా హక్కు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి. చట్టాన్ని ఉల్లంఘించే స్కూళ్లపై కఠిన చర్యలు తీసుకోవాలి. తల్లిదండ్రులకు ఆర్థిక భారం లేకుండా విద్యా వ్యవస్థను నడిపే దిశగా చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం విద్యార్థుల నుంచి వసూలు చేస్తున్న ఫీజుల వివరాలను నోటీసు బోర్డులో పెట్టాలి. సెక్షన్- 12 ప్రకారం స్కూల్ స్టాఫ్ సెలక్షన్ కమిటీ ప్రభుత్వ నిబంధనల ప్రకారం టీచర్లను, నాన్ టీచింగ్ స్టాఫ్‌ను నియమించి వారి వివరాలు, విద్యార్హత, వారికి ఇచ్చే వేతనాల వివరాలను నోటీసు బోర్డులో పెట్టాలని చట్టం చెబుతుంది. సెక్షన్- 12 ప్రకారం టీచర్ విద్యార్థుల నిష్పత్తి 1:20 కి మించరాదు. చట్టం ప్రకారం ప్రతి ప్రైవేటు యాజమాన్యం 25% సీట్లను ఎస్సి, ఎస్టి, వికలాంగులకు, మైనారిటీలకు కేటాయించాలి. ఇవేకాకుండా పాఠశాలల్లో మున్సిపాలిటీ పరిధిలో అయితే 1000 చదరపు మీటర్ల ఆట స్థలం, గ్రామీణ ప్రాంతాల్లో అయితే 2000 చదరపు మీటర్ల ఆటస్థలం తప్పనిసరిగా ఉండాలి. కానీ ఇప్పుడు ఉన్నటువంటి ప్రైవేటు పాఠశాలలు దేన్నీ పాటించడం లేదు. ప్రతి సంవత్సరం తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్యం, విద్యావేత్తలు, మేధావులు, అధికారులు సభ్యులుగా ఉన్నటువంటి ఫీ రెగ్యులేషన్ కమిటీ ఫీజులను నియంత్రణ చేసే నియంత్రణ వ్యవస్థ ఉండాలి.

# పాకిస్తాన్ లో సింధు జల పోరాటం

**వేద న్యూస్, డెస్క్:**



పాకిస్తాన్ సైన్యం సింధు కాలువల ప్రాంతాన్ని యుద్ధ భూమిగా మార్చింది. పాకిస్తాన్ సైన్యం ఆధ్వర్యంలో ప్రభుత్వం చేపట్టిన సింధు కాలువల ప్రాజెక్టుకు వ్యతిరేకంగా ప్రజలు పెద్దఎత్తున నిరసన తెలిపారు. ఒక దశలో నిరసనలు దౌర్జన్య పూరితంగా మారాయి. ఆగ్రహోదగ్రులైన ప్రజలు ఒక ఆయిల్ టాంకర్ కు, ఓమంత్రి ఇంటికి నిప్పుపెట్టారు. నిరసన కారులపై పోలీసులు కాల్పులు జరిపారు. ఫలితంగా ఇద్దరు చనిపోయారు. 15 మంది గాయపడ్డారు. ఉత్తర సింధ్ వర్చువల్ యుద్ధ భూమిగా మారిపోయింది. పాకిస్తాన్ పీపుల్స్ పార్టీ నాయకుడు బిలావల్ భుట్టో , ఆయన పార్టీని సింధీ ప్రజలు దుమ్మెత్తి పోశారు. తమ కష్టాలకు పంజాబ్ ఆధిపత్యమే కారణమని నిందించారు. చాలా కాలంగా సింధు నది వ్యవస్థపై విరసన వ్యక్తమవుతోంది. సైన్యం మద్దతుతో చేపట్టిన కాలువ ప్రాజెక్టును సింధు ప్రావిన్స్ లోని ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తూ, ఆందోళన సాగిస్తున్నారు. ఆ ఆందోళన కొత్త ఊపు అందుకుంది. గత నెలలో ఈ ప్రాజెక్టును నిలిపివేసిన ప్రభుత్వం మళ్లీ మొదలు పెట్టడంతో నిరసనలు వెల్లువెత్తాయి. దీంతో హింసాకాండ కా దారితీసింది. , పోలీసులు ఇద్దరిని కాల్చిచంపారు. నిరసన కారులు పాకిస్తాన్ పీపుల్స్ పార్టీకి చెందిన మంత్రి ఇంటిపై దాడి చేశారు.పాకిస్తాన్ లోని నాలుగు ప్రావిన్స్ లలో సింధ్, పంజాబ్ కీలకమైనవి. అధికార, సైనిక సంస్థల శక్తి కేంద్రాలు. పంజాబ్ ఆధిపత్యం పెచ్చుపెరుగుతోందని సింధ్ ప్రజలు ఆగ్రహంతో ఉన్నారు. సింధ్ కు చెందిన పీపీపీ షాబాజ్ షరీఫ్ సంకీర్ణ ప్రభుత్వంలో భాగస్వామిగా ఉంది. సింధ్ ప్రావిన్స్ లోనూ అధికారంలో ఉంది.సింధీ జాతీయవాద పార్టీ జీ సింధ్ ముత్తహిదా మహాజ్ (జెఎస్ఎంఎం) సింధ్ కాలువ ప్రాజెక్టును వ్యతిరేకిస్తూ ఉద్యమిస్తోంది.

# వక్ఫ్ బోర్డుల్లో ముస్లిమేతరులు వుంటారు!

వేద న్యూస్, న్యూఢిల్లీ :

వక్ఫ్ బోర్డుల్లో ముస్లిమేతరులు వుంటారని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. వైవిధ్యతను పెంపొందించడం కోసమే వక్ఫ్ బోర్డుల్లో ముస్లిమేతరులను చేరుస్తున్నామని, ఈ వక్ఫ్ బోర్డులు లౌకిక విధులను నిర్వహిస్తాయని, అందువల్ల ముస్లిమేతరులతో సహా ఎవరి పనితీరు ప్రభావితం కాదని పేర్కొంది. వక్ఫ్ బోర్డులలో ముస్లిమేతరులను చేర్చడాన్ని అనుమతిస్తామని, అది కూడా ఇద్దరికే పరిమితం చేశామని స్పష్టం చేసింది. దీనివల్ల వక్ఫ్ అడ్మినిస్ట్రేషన్ ఇస్లామిక్ స్వభావం విషయంలో రాజీ పడకుండా సమతూకంతో కూడిన పారదర్శక పాలనకు హామీ కల్పించబడుతుందని కేంద్రం పేర్కొంది. ఈ చట్టాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై బుధవారం కూడా విచారణ కొనసాగింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్ గవారు, జస్టిస్ అగస్టిన్ జార్జ్ మాసిలతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా కేంద్రం తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు. ప్రజల ఆస్తులను




అక్రమంగా పక్కదారి పట్టించే ప్రయత్నాలను సర్కారు చూస్తూ ఊరుకోదన్నారు. వక్ఫ్ బోర్డులో ఇద్దరు ముస్లిమేతరులు వుంటే వచ్చే నష్టం ఏమిటని ఆయన ప్రశ్నించారు. ఇందులో మతపరమైన అంశాల జోక్యమేమీ లేదన్నారు. "దానధర్మాలు ప్రతి మతంలో భాగమని, క్రైస్తవులు, హిందువులు, సిక్కులకు కూడా ఈ దాన వ్యవస్థ వుంది. వక్ఫ్ అనేది ఇస్లాంలో దాతృత్వం తప్ప మరొకటి కాదు. వక్ఫ్ బోర్డు వక్ఫ్ ఆస్తులను నిర్వహించడం, అకౌంట్ ఖాతాలను ఆడిట్ చేయడం వంటి లౌకిక విధులను మాత్రమే నిర్వహిస్తుంది. నేను ముస్లిమేతరులైన ఇద్దరు సభ్యుల గురించే చెబుతున్నాను. వక్ఫ్ బోర్డులలో ఇద్దరు ముస్లిమేతరులు వుండటం వల్ల ఏమి మారుతుంది. వక్ఫ్ బోర్డుకు ఎలాంటి మతపరమైన కార్యకలాపాలకు సంబంధం లేదు.' అని మెహతా అన్నారు. "హిందూ ఎండోమెంట్ బోర్డులు మతపరమైన కార్యకలాపాలను మాత్రమే నిర్వహిస్తాయని, వక్ఫ్ బోర్డు లౌకిక కార్యకలాపాలను నిర్వహిస్తుంది." అని చెప్పారు. ఇస్లాంకి సంబంధించిన ఎలాంటి మతపరమైన అంశాల విషయంలో వక్ఫ్ చట్టం - 2025 జోక్యం చేసుకోదని, కేవలం ముతవాలీ (వక్ఫ్ ఆస్తుల మేనేజర్) గురించే మాట్లాడుతోందని తెలిపారు. ముతవాలీలను ఎవరు నియమిస్తారని సిజెఐ ప్రశ్నించగా, వక్ఫ్ బోర్డేనని చెప్పారు. అయన ముస్లిమేతరుడు అయి వుండవచ్చా? అనగా వుండొచ్చునని, ఆయనకు ఎలాంటి మత పరమైన కార్యకలాపాలు వుండవని అన్నారు.

# 'ఆపరేషన్ సిందూర్'తో ఏం సాధించారు?



**వేద న్యూస్, న్యూఢిల్లీ :**

ఆపరేషన్ సిందూర్ ద్వారా ఏం సాధించారో చెప్పాలని కేంద్ర ప్రభుత్వాన్ని కాంగ్రెస్ పార్టీ నాయకులు జైరామ్ రమేష్ ప్రశ్నించారు. న్యూఢిల్లీలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ '26/11 ఘటన తరువాత భారత్‌కు ప్రపంచ దేశాల మద్దతు లభించింది. నిందితులు మరణించారు. ఒకర్ని అరెస్టు చేశారు. పహల్గామ్ దాడి తరువాత, ప్రభుత్వం విదేశాలకు దౌత్య ప్రతినిధులను పంపి, ఉగ్రవాదులు పరారీలో ఉండగా ఓ పత్రాన్ని సిద్ధం చేస్తోంది' అని అన్నారు. ఏప్రిల్ 22న పహల్గామ్ దాడి వెనుక ఉన్న ఉగ్రవాదులను నెల తరువాత కూడా ఎందుకు అరెస్టు చేయలేదని ప్రభుత్వాన్ని ఆయన ప్రశ్నించారు. 2008 ముంబై ఉగ్రవాద దాడులకు పాల్పడిన ఉగ్రవాదులు చంపబడ్డారని, ఒకరిని అరెస్టు చేశారని, దీని కారణంగా భారతదేశానికి ప్రపంచ దేశాల మద్దతు లభించిందని ఆయన ఎత్తి చూపారు. ప్రస్తుత పరిస్థితి చూస్తే విదేశాలకు దౌత్య ప్రతినిధులను పంపి, ఓ పత్రాన్ని సిద్ధం చేస్తున్నారని, కానీ ఉగ్రవాదులను అరెస్టు చేసి విచారించడమే ముఖ్యమని అన్నారు.

# మావోయిస్టుల ఖేల్ ఖతమేనా?

**వేద న్యూస్, న్యూఢిల్లీ :**



భారత హోంమంత్రి అమిత్ షా బుధవారం నాడు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని నారాయణపూర్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో భారత కమ్యూనిస్టు పార్టీ మావోయిస్టు కేంద్ర కమిటీ కార్యదర్శి నంబాల కేశవరావు అలియాస్ బసవరాజు మరణంతో మావోయిస్టు ఉద్యమం ఈ దేశంలో తుడిచి పెట్టుకుపోయినట్టే అని ప్రకటించారు. నిజానికి మావోయిస్టులు అలాంటి పరిస్థితుల్లో ఉన్నారా? నంబాల కేశవరావు మృతి మావోయిస్టు ఉద్యమానికి పెద్ద దెబ్బే. మునుపెన్న డు ఇంత పెద్ద విఘాతం పార్టీకి తగలలేదు. ఇప్పటివరకు మావోయిస్టులకు రాష్ట్ర ప్రభుత్వాలకు మధ్య జరిగిన అనేక ఘర్షణల్లో పలువురు ముఖ్య నక్సలైట్ నాయకులు మరణించినప్పటికీ కేంద్రపార్టీ కార్యదర్శి ఎన్‌కౌంటర్‌లో మృతి చెందడం ఇది మొట్టమొదటిసారి కాబట్టి దీన్ని పెద్ద దెబ్బగా పరిగణించాల్సిందే. ఉత్తరాంధ్ర ప్రాంతం నుంచి మొదలైన నక్సలైట్ ఉద్యమం తెలంగాణకు వచ్చేసరికి ఉత్తర తెలంగాణ జిల్లాలు పట్టుకొమ్మలుగా మారాయి. ఈ ప్రాంతం నుంచే ముఖ్యంగా వరంగల్, కరీంనగర్ , ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల నుండి విద్యాధికులు, మేధావులు అనేకమంది అజ్ఞాతం బాట పట్టిన విషయం తెలిసిందే. బుధవారం నాటి ఎన్‌కౌంటర్‌లో మరణించిన కేశవరావు ఉత్తరాంధ్రలో పుట్టి ఉత్తర తెలంగాణలో నక్సలిజం బాట పట్టారు. ఇప్పుడు కేంద్ర హోంమంత్రి ఎక్స్‌లో ప్రకటించినట్టుగా మొత్తంగా నక్సలైట్ ఉద్యమం ఈ బుధవారం నాటి ఎన్‌కౌంటర్‌తో అంతరించినట్టేనా? ఇంకెవరు మిగిలి లేరా? హోం మంత్రి అమిత్ షా మరో మాట కూడా అన్నారు. ఆపరేషన్ బ్లాక్ ఫారెస్ట్‌గా తాము పిలుచుకుంటున్న ఆపరేషన్ పూర్తయినట్టేనని అందుకు సంతోషంగా ఉందని ప్రకటించారు. ఆయన మాటలు ఎంత వరకు నిజం. పోయిన వాళ్ళు పోగా ఉత్తర తెలంగాణ నుంచి ఉద్యమంలోకి వెళ్లిన ఇంకెంతో మంది జీవించే ఉన్నారు. ఇప్పుడు వాళ్లంతా ఏమయ్యారు. బుధవారం నాటి చర్యతో వాళ్లంతా ఉద్యమాన్ని వదిలేసి బయటికి వచ్చినట్టేనా? అనే చర్చ ఉత్తర తెలంగాణ జిల్లాల్లో సాగుతున్నది. పీపుల్స్ వార్‌గా పార్టీ ఉన్నప్పుడు పులి అంజయ్య అలియాస్ సాగర్ ఎన్‌కౌంటర్ జరిగిన దశలో ఎన్‌కౌంటర్ల పరంపర జరిగి అనేక మంది రాష్ట్ర కమిటీ స్థాయి నాయకులు మృతి చెందారు. వారిలో దగ్గు రాయలింగు, సాయని ప్రభాకర్, గోపగాని అయిలయ్య,తదితరులు రాష్ట్ర కమిటీ స్థాయిలో పని చేసారు. అప్పుడు ఉత్తర తెలంగాణ స్పెషల్ జోనల్ కమిటీ పేరిట రాష్ట్ర కమిటీ స్థాయి కలిగి ఉండేది. అయితే అప్పుడు నాయకత్వంలో కొనసాగిన అనేకమంది విప్లవ కారులు ఉద్యమంలో కొనసాగుతుండడం వల్ల ఎన్‌కౌంటర్‌ల ప్రభావం ఉద్యమంపై కనిపించలేదు. అలాగే 1990ల నాటి ఉద్యమ అనుకూల పరిస్థితుల ప్రభావం కూడా కొత్త రక్తం పార్టీలో వచ్చి చేరేందుకు ఉపకరించిందనే వాదన ఉండేది.

# విలాసవంత జీవితం స్పాన్సర్ చేసింది యూఏఈ కంపెనీ!

**వేద న్యూస్, న్యూఢిల్లీ :**



పాకిస్థాన్‌కు గూఢచర్యం చేసిందన్న ఆరోపణలతో అరెస్టయిన హర్యానాకు చెందిన యూట్యూబర్ జ్యోతి మల్హోత్రా కేసులో దర్యాప్తు కొనసాగుతోంది. ఈ క్రమంలో ఆమె విలాసవంతమైన జీవనశైలి, విదేశీ పర్యటనలకు నిధులు ఎలా సమకూరాయన్న కోణంలో అధికారులు లోతుగా విచారిస్తున్నారు. తాజాగా, ఆమెకు సంబంధించిన ఓ కీలక విషయం వెలుగులోకి వచ్చింది. జ్యోతి మల్హోత్రా చేసిన కొన్ని వీడియోలకు యూఏఈ కేంద్రంగా పనిచేస్తున్న 'వెగో' అనే ట్రావెల్ కంపెనీ స్పాన్సర్‌గా వ్యవహరించినట్లు తెలుస్తోంది. ఈ విషయాన్ని విశ్వసనీయ వర్గాలు వెల్లడించి నట్లు జాతీయ మీడియా కథనాలు పేర్కొంటున్నాయి. 'వెగో' సంస్థకు అంతర్జాతీయ విమాన రవాణా సంఘం గుర్తింపు ఉంది. సింగపూర్, దుబాయ్ వంటి నగరాల్లో ఈ కంపెనీకి కార్యాలయాలున్నాయి. అంతేకాకుండా, పాకిస్థాన్‌లోనూ చట్టబద్ధంగా కార్యకలాపాలు నిర్వహించడానికి 'వెగో'కు లైసెన్స్ ఉందని సమాచారం. అయితే, ఈ సంస్థ నేరుగా పాకిస్థాన్‌కు నిధులు సమకూర్చినట్లు ఆధారాలు లేకపోయినా, గూఢచర్యం ఆరోపణలు ఎదుర్కొంటున్న జ్యోతి మల్హోత్రా ప్రయాణాలకు స్పాన్సర్‌గా నిలవడంపై అధికారులు దృష్టి సారించారు. ఈ దిశగా దర్యాప్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. ట్రావెల్ బ్లాగర్‌గా, యూట్యూబర్‌గా గుర్తింపు పొందిన జ్యోతి మల్హోత్రా 'ట్రావెల్ విత్ జో' పేరుతో ఒక యూట్యూబ్ ఛానెల్‌ను నిర్వహిస్తోంది. ఈ ఛానెల్ ద్వారా ఆమె ఇండోనేషియా, బ్యాంకాక్ వంటి దేశాల్లో పర్యటించిన వీడియోలను పోస్ట్ చేసింది. ఆమె ఛానెల్‌కు సుమారు 4 లక్షల మంది సబ్‌స్క్రైబర్లు ఉన్నప్పటికీ, ఆమె అనుభవిస్తున్న విలాసవంతమైన జీవితం పలువురిని ఆశ్చర్యపరిచింది.

